సాక్షి తిరుపతి

బుధవారం । 23 । జూలై । 2025



స్నాతకోత్సవం నిర్వహించండి

ఎస్వీయూ స్నాతకోత్సవం నిర్వహించాలని జీఎన్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ కోరారు. - 8లో



నాణ్యత ఊసేదీ.. బుక్స్‌కు బ్యాగేదీ?

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూటమి సర్కారు పంపిణీ చేసిన బ్యాగ్‌లు నెల రోజులు కూడా గడవక ముందే చిరిగిపోయాయి. - 8లో



కూలీల సంఖ్య పెంచండి

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. కాటూరులో పనులు పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

పీ4 లక్ష్యం దిశగా అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పీ–4 లక్ష్యం దిశగా అడుగులు వేయడానికి సంపన్నులు ముందుకు రావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులతో కలసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక అసమానతలను తగ్గించడానికి సర్కార్ పీ–4 ప్రాజెక్టును తీసుకొచ్చిందని వెల్లడించారు. సర్వేలో తేలిన లెక్క ప్రకారం జిల్లాలోని అన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే ఆగస్టు 15 నాటికి పీ–4 లక్ష్యానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అట్టడుగు పేదరికంలోని 20 శాతం మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులు(దాతలు) ముందుకు రావాలని కోరారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు తప్పకుండా పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. అర్జీదారులతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. ప్రధానంగా మండల, డివిజన్ స్థాయిల్లోను తప్పకుండా ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్, ప్రణాళిక విభాగం జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఏఓ ప్రసాద్‌రావు, డీఎస్‌వో శేషాచలం రాజు పాల్గొన్నారు.

వైద్యసేవల ధరలు నోటీస్ బోర్డులో ఉంచాలి



డాక్టర్ బాలకృష్ణ నాయక్

తిరుపతి తుడా: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్వహించే యజమానులు ప్రజలకు తెలిసేలా వైద్యసేవల ధరల పట్టికను నోటీసు బోర్డుల్లో తప్పక ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు ఆస్పత్రిలో ఆ సంస్థ వారు అందించే ప్రతి సేవకు వసూలు చేసే ధరల వివరాలను స్థానిక, ఆంగ్ల భాషల్లో రిసెప్షన్ కౌంటర్‌లో కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆస్పత్రి యాజమాన్యం వసూలు చేస్తే రేట్ల వివరాలను వారంలోపు demotirupati@gmail.comకు ఈమెయిల్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి విధిగా అందజేయాలని సూచించారు. వారం లోపు వివరాలను పంపని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 77,481 మంది స్వామివారిని దర్శించుకోగా 30,612 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'ఆరా ఆఫ్ ఆర్ట్స్ మ్యాగజైన్'ను వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణి మంగళవారం వర్సిటీలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం కార్యాలయం ప్రకాశం భవనంలో ఉండడం, అలాగే ఆర్ట్స్ కళాశాల పేరు ప్రతిబింబించేలా ఆరా పేరుతో ఈ మ్యాగజైన్ తీసుకుని రావడం హర్షణీయమన్నారు. మ్యాగజైన్‌లో విద్యార్థుల కవితలు, వ్యాసాలు, వివిధ శాఖల పురోభివృద్ధి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో సాధించిన విజయాలు వంటి వాటితో ప్రకాశిస్తుందని, ఇది దాదాపు 200 పైచిలుకు పుటలు కలిగిన డాక్యుమెంటరీ వంటి పుస్తకమన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య సుమకిరణ్, వార్డెన్ ఆచార్య ప్రయాగ, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య అమీనుల్లా, డాక్టర్ ఓబులేసు, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

వృత్తివిద్య.. ఆదరణ మిథ్య



పాలిటెక్నిక్.. ఇది సాంకేతిక విద్య.. విద్యార్థి ఉపాధికి చక్కని మార్గం.. అయినా ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం.. మౌలిక వసతులు, ల్యాబ్‌లు, అవగాహన లేమి.. అధ్యాపకుల కొరత.. ప్రోత్సాహం కరువు తదితర కారణాలతో విద్యార్థులు ఆ కోర్సుల్లో ప్రవేశానికి మొగ్గు చూపడం లేదు. ఫలితంగా పలు కళాశాలల్లో సీట్లు భర్తీకి నోచుకోక మిగిలిపోతున్నాయి. దీంతో కాలేజీల భవిత ప్రశ్నార్థకంగా మారుతోంది.

పాలిటెక్నిక్ కోర్సుల్లో తగ్గుతున్న అడ్మిషన్లు
- పలు కళాశాలల్లో ప్రవేశాలు సింగిల్ డిజిట్‌కే పరిమితం
- అయోమయంలో పలు కళాశాలల భవితవ్యం

తిరుపతి సిటీ: అతి పిన్నవయస్సులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందే వృత్తి విద్యగా పేరుగాంచిన పాలిటెక్నిక్ కోర్సులకు ఆదరణ క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన ఏపీ పాలిసెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 6 ప్రభుత్వ కళాశాలలో అంతంత మాత్రంగానే అడ్మిషన్లు జరిగాయి. గూడూరు, సత్యవేడు కళాశాలలో 90 శాతం సీట్లు ఖాళీగా ఉండడం విశేషం. కేవలం తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే పూర్తి స్థాయి ప్రవేశాలు జరిగాయి. జిల్లాలో ప్రైవేటు కళాశాలలు సుమారు 11 వరకు ఉండగా అందులో 5 కళాశాలు ఇప్పటికే మూతపడ్డాయి. ప్రస్తుతం నడుస్తున్న ఆరు కళాశాలలోనూ అడ్మిషన్లు 20 శాతం దాటకపోవడం గమనార్హం.

నేటి నుంచి తుది విడత ప్రవేశాలు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ పాలిసెట్ ద్వారా ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. ఇందులో భాగంగా సోమవారం వరకు విద్యార్థులకు బ్రాంచ్, కళాశాల మార్పునకు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ ఈ నెల 23వ తేదీ నుంచి తుది విడత ప్రవేశాల్లో భాగంగా కొనసాగనుంది. అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి వచ్చేనెల మొదటి వారంలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయ్యాయి. తిరుపతి మహిళా పాలిటెక్నిక్‌లో సైతం దాదాపు అన్ని సీట్లు భర్తీ కాగా లేటరల్ ఎంట్రీ సీట్లు 15 మిగిలినట్లు సమాచారం. అలాగే పుత్తూరులోని పిల్లారిపట్టు, చంద్రగిరి పాలిటెక్నిక్ కళాశాలలో 80 శాతం సీట్లు భర్తీ కాగా గూడూరు, సత్యవేడు ప్రభుత్వ కళాశాలలో దాదాపు 90 శాతం సీట్లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న ఆరు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక్కో కళాశాలలోని కొన్ని బ్రాంచ్‌ల్లో ఒక్క అడ్మిషన్ జరగపోవడం విశేషం.

నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కొరతే కారణం

జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు కొరతతోపాటు, మెకానికల్, సివిల్, ట్రిపుల్ఈ, ఈసీఈ, సీఎస్ఈ వంటి కోర్సులకు అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతో పాటు అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు, స్కిల్‌డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వకపోవడం, మౌలిక సదుపాయాల కొరతతో ప్రవేశాలు దారుణంగా పడిపోయాయని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది. కోర్సు పూర్తి చేసుకున్న మెరిట్ విద్యార్థులకు బీటెక్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించకుండా అడ్మిషన్లు చేపడితే తప్ప వృత్తి విద్య కోర్సు పాలిటెక్నిక్‌కు మునుపటి ఆదరణ లభించదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా పాలిటెక్నిక్ కళాశాలలోని సీట్ల వివరాలు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	బ్రాంచ్‌ల సంఖ్య	మొత్తం సీట్లు	మిగిలిన సీట్లు
తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్	9	594	5
తిరుపతి మహిళా పాలిటెక్నిక్	3	198	15
గూడూరు	4	264	154
పుత్తూరు(పిల్లారి పట్టు)	4	264	82
చంద్రగిరి	2	132	24
సత్యవేడు	4	264	192

వంద శాతం ప్లేస్‌మెంట్ అవకాశాలు



తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని బ్రాంచ్‌ల్లో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యాయి. లేటరల్ ఎంట్రీ సీట్లు మాత్రమే కొంత మేర మిగిలియాయి. ఇతర కళాశాలల బదిలీపై వచ్చే విద్యార్థులతో ఆ సీట్లు సైతం పూర్తి స్థాయిలో భర్తీ కానున్నాయి. కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికీ క్యాంపస్‌డ్రైవ్‌లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. గత ఏడాది అన్ని బ్రాంచ్‌ల్లోని విద్యార్థులు వంద శాతం ప్లేస్‌మెంట్స్ సాధించారు. దీంతో పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

– వై.ద్వారకనాథరెడ్డి, ప్రిన్సిపల్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి

క్యాంపస్ డ్రైవ్‌లు లేమి



పాలిటెక్నిక్ డిప్లొమో చేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో అద్భుత అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు పేరొందిన ఎంఎన్‌సీ కంపెనీలలో మంచి ప్యాకేజ్‌తో ఉపాధి లభిస్తుంది. అయితే పలు కళాశాలల్లో క్యాంపస్ డ్రైవ్‌లు లేక ఉద్యోగాలు దొరకడం లేదు. దీనికితోడు డిప్లొమో కోర్సులను నడుపుతున్న విద్యాసంస్థల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించడం లేదు. ఈ దిశగా చర్యలు తీసుకుంటే ప్రతి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పెరుగుతాయి. –పరమేశ్వర్‌రావు, రిటైర్డ్ అధ్యాపకులు, తిరుపతి

ప్రోత్సహించాలి



వృత్తి విద్యను అభ్యసించిన విద్యార్థులు 19, 20 ఏళ్లకే ఉద్యోగం సాధిస్తున్నారు. విద్యారంగంలో ఇంత చిన్న వయస్సులో మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించేందుకు అవకాశం ఉన్న కోర్సు పాలిటెక్నిక్ ఒక్కటేనని చెప్పవచ్చు. అయితే ఈ విద్య వైపు విద్యార్థులను ప్రోత్సాహించాలి. ఆ దిశగా కింది స్థాయి విద్యాసంస్థలు, తల్లితండ్రులు విద్యార్థులను ప్రోత్సహించడం లేదు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు నీట్, జేఈఈ శిక్షణ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. పాలిటెక్నిక్ విద్యను ప్రొత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ప్రభాకర్‌రెడ్డి, ఓ ప్రైవేటు సంస్థ యజమాని, బెంగళూరు

అవగాహన లోపంతోనే అడ్మిషన్లు తగ్గుముఖం



పాలిటెక్నిక్ విద్యపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు చాలావరకు అవగాహన లేకపోవడంతో ఆ దిశగా ఆలోచించడం లేదు. నీట్, ఎంసెట్ అంటూ కొన్ని ప్రైవేటు సంస్థలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మాయలో పడేసి వ్యాపారం చేసుకుంటున్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయి. ఎంబీబీఎస్, బీటెక్ చేసిన విద్యార్థుల కంటే డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులు త్వరగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు.

–వాణిశ్రీ, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత అధికారి, తిరుపతి

మా పిల్లలకు చదువు వద్దు

- బడికి ముళ్ల కంచె వేసిన తల్లిదండ్రులు



తుంబూరు దళితవాడ పాఠశాలకు కంచెను ఏర్పాటు చేసిన గ్రామస్తులు

నారాయణవనం: విలీనాన్ని నిరసిస్తూ మండలంలోని తుంబూరు దళితవాడ బడికి తల్లిదండ్రులు మంగళవారం తాళం వేసి, ఎవరూ ప్రవేశించకుండా ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. మా ఊరి బడిలో మా పిల్లలు చదువుకునే అవకాశం లేనప్పుడు మా పిల్లలకు చదువు అవసరం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇకపై టీచర్లు మా బడికి రావద్దంటూ పంపివేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 56 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం బడుల విలీనంలో భాగంగా దళితవాడ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చిందన్నారు. మా ఊరి పిల్లలు 46 మందిని కేవలం 16 మంది మాత్రమే చదువుతున్న సమీపంలోని గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు పంపివేశారని పేర్కొన్నారు. గ్రామంలోని బడిలో పిల్లలు లేకుంటే దళితవాడ బడి పిల్లలను ఎలా పంపుతారని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాల పునఃప్రారంభంలో మూడు సార్లు నిరసన తెలిపినా అధికారులు స్పందించలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే కేసులు పెడుతామని ఎంఈఓ హెచ్చరించడంతో మంగళవారం తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి, ఎవరూ లోపలికి ప్రవేశించకుండా ముళ్ల కంప వేశారు. పేద దళిత పిల్లల చదువు కోసం తామే స్వచ్ఛందంగా అరెస్టు కావడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులతో అణచివేయలేరు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అనైతికం
- వైఎస్సార్ సీపీ సత్యవేడు సమన్వయ కర్త నూకతోటి



ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ బుచ్చినాయుడుకండ్రిగలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న నూకతోటి రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీని అణచివేయలేరని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆయన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి చర్యలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో ప్రతీకారం, కోపం, పట్టుదలను మరింత పెంచి, కసితో ప్రభుత్వ కుట్రలను ఎదుర్కొనేలా చేస్తాయని తెలిపారు. రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక సీఎం చంద్రబాబు తప్పుడు కేసులతో వారిని అణచివేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నా యకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పోరాటాలు, ఉద్యమాలు, నిరసనల ద్వారా కూటమి ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి, కేవటం రాజకీయ వేధింపులతో అక్రమ అరెస్టులు చేస్తూ కూటమి నాయకులు రాక్షస ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

రక్షణ ఛత్రం.. తిరుపతికి రిక్తహస్తం



ప్రయాణికుల భద్రత..రక్షణతోపాటు నేర నియంత్రణ.. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా.. ఉగ్రవాద మూకలకు అడ్డుకట్ట వేయడంలో ముఖగుర్తింపు సాంకేతికత అమలు ఎంతో కీలకం. ఈ టెక్నాలజీని రైల్వే మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో అమలు చేస్తోంది. అయితే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి రైల్వేస్టేషన్‌లో మాత్రం ఆ సాంకేతికత అమలు చేయడం లేదు. ఇందుకు ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం.. ఉదాశీనతే కారణమని తిరునగరి వాసులు ఆరోపిస్తున్నారు.

- ప్రధాన రైల్వేస్టేషన్లలో ముఖగుర్తింపు సాంకేతికత అమలు
- తిరుపతికి లభించని చోటు
- ప్రస్తుత పాలకుల తీరుకు నిదర్శనం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ దేశంలోని ఏడు ప్రధాన రైల్వేస్టేషన్లలో ముఖగుర్తింపు సాంకేతికతను ప్రవేశపెట్టింది. న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, హౌరా స్టేషన్లలో అమలు చేశారు. ఈ టెక్నాలజీ అనుమానితులను గుర్తించి, భద్రతను పటిష్ట పరచడంలో సహాయపడుతుంది. ముఖ గుర్తింపు సాంకేతికత ప్రయాణికుల సౌలభ్యాన్ని పెంచి, టికెట్ తనిఖీలను వేగవంతం చేస్తుంది. అయితే ఈ సాంకేతికత అమలులో తిరుపతికి చోటు దక్కలేదు.

తిరుపతికి లభించని చోటు

ముఖ గుర్తింపు సాంకేతికత అమలులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి రైల్వేస్టేషన్‌కు చోటు లభించలేదు. ఇది ప్రస్తుత పాలకుల తీరుకు అద్దం పడుతోంది. శ్రీవారి దర్శనార్థం నిత్యం దేశ నలుమూలల నుంచి ప్రతిరోజు సుమారు లక్ష మంది రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో తిరుపతి రైల్వేస్టేషన్ ప్రయాణీలకుతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికితోడు ఇటీవల దీన్ని ప్రపంచ ప్రఖ్యాత మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇలాంటి ప్రముఖ రైల్వేస్టేషన్‌కు ముఖగుర్తింపు సాంకేతికతను ఏర్పాటు చేయడంలో రైల్వేశాఖ ఎందుకు మౌనంగా ఉందనేది ప్రశ్నార్థకంగా మారింది.

క్రిమినల్స్‌ను గుర్తించే అవకాశం

రైల్వే స్టేషన్లు రోజూ లక్షలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి చోట్ల దొంగతనాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, నేరాలు, ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఎక్కువ. అందుకే ఈ టెక్నాలజీని ఉపయోగించడంతో క్రిమినల్స్‌ను ముందుగానే గుర్తించడం, అనుమానితుల్ని ట్రాక్ చేయడం, భద్రతను పెంపొందించడం సాధ్యమవుతుంది. ముఖ గుర్తింపు టెక్నాలజీ సాంకేతిక పురోగతిలో ఒక పెద్ద అడుగు. ఇది భద్రత పెంపొందించడంలో సహాయపడుతుంది. అయితే దీనికి సంబంధించిన గోప్యతా సమస్యలు, ఖర్చును, సాంకేతిక లోపాలను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

ముఖగుర్తింపు సాంకేతికత అంటే..

ఈ టెక్నాలజీ మన ముఖంలో ఉన్న లక్షణాలు, అందులో ముఖ్యంగా కళ్ల స్థానం, ముక్కు, నోరు, ముఖం ఆకారాన్ని గుర్తించి, వాటిని ఒక డేటాబేస్‌లో ఉన్న ఫొటోలతో పోల్చుతుంది. ఇది కృత్రిమ మేధస్సు (ఎఐ), మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లపై ఆధారపడుతుంది. దీంతో నేర చరిత ఉన్నవారిని గుర్తిస్తుంది.



రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీ



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,02,570
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,285
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,17,600
రిటైల్ వెండి గ్రాము	రూ.120.60

క్లుప్తంగా

ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి యువకుడి బలి



అశోక్ కుమార్(ఫైల్)

తిరుపతి రూరల్: మండలంలోని సాయి నగర్‌లో నివాసముంటున్న ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బానిసై మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సాయినగర్‌లో నివాసముంటున్న అశోక్‌కుమార్ (25) తిరుపతి నగరంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి, జీవనం సాగిస్తున్నాడు. దినసరి కూలీగా వెళ్లి వచ్చిన డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు అలవాటు పడి అధిక అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి అతని తండ్రి చంద్రబాబుకు తెలియజేయగా ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

రాపూరు: కోటూరుపాడు మార్గంలో ఉన్న మద్యం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం కేస్‌లను చోరీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం రాత్రి యథావిధిగా దుకాణానికి తాళాలు వేసి, వెళ్లామని, సిబ్బంది మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు రావడంతో తాళాలు పగలకొట్టి ఉండగా గుర్తించారు. షాపులోనికి వెళ్లి పరిశీలించగా 4 కేసుల 29 మద్యం సీసాలు, రూ.11,800 నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడ్వకేట్.. అడ్డంగా బుక్ అయ్యాడు!

తిరుపతి రూరల్: ఆన్‌లైన్‌లో ఫేక్ మెసేజ్‌లు పంపి, సైబర్ చోరీలకు పాల్పడే నేరగాళ్లకు ఓ అడ్వకేట్ అడ్డంగా చిక్కాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ విద్యానగర్ కాలనీలో నివాసముంటున్న ఓ న్యాయవాది సెల్‌ఫోన్ నంబర్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆ తరువాత అదే నంబర్‌కు ఏపీకే అప్లికేషన్ పంపడం, ఆ అప్లికేషన్ ఓపెన్ చేయగా మూడు అకౌంట్లకు సంబంధించిన నగదు 8 అకౌంట్లకు బదిలీ కావడంతో సదరు అడ్వకేట్ కంగు తినాల్సి వచ్చింది. ఆ వెంటనే బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేసే ప్రయత్నం చేసినప్పటికీ సైబర్ నేరగాళ్లు చాకచక్యంగా అడ్వకేట్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.3.50 లక్షలు కాజేశారు. ఆ వెంటనే సదరు అడ్వకేట్ 1930కు ఫిర్యాదు చేయగా మిగతా బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయించి, సైబర్ నేరగాళ్లు డబ్బులు డ్రా చేయకుండా చర్యలు తీసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత ఊసేదీ.. బుక్స్‌కు బ్యాగేదీ?

అభివృద్ధికి చిహ్నంగా నిలిచే సంక్షేమ పథకాల ఫలాలు ఏడాదిపాటు మన్నికగా ఉంటే నలుగురికి ఉపయోగం. కానీ ఆర్భాటపు ప్రచారాలు.. కూటమి డొల్లతనంలో చిన్నారులకిచ్చిన బ్యాగుల నాణ్యత నలిగిపోగా..నిర్లక్ష్యం తాండవిస్తోంది. విద్యార్థుల కిచ్చిన నాలుగు రోజులకే బ్యాగులు చిరిగిపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.



ప్రభుత్వం ఇచ్చిన బ్యాగులు చినిగిపోవడంతో సొంత బ్యాగులతో పాఠశాలకు వెలుతున్న విద్యార్థులు

- నెలరోజులకే...చిరిగిపోయిన స్కూల్ బ్యాగులు
- సొంత బ్యాగులతో పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ బ్యాగులకు పిన్నులు వేసుకుని వెళుతున్న మరికొందరు

తిరుపతి సిటీ: ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నాణ్యమైన బ్యాగులు ఇచ్చామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కూటమి సర్కార్ డొల్లతనం బయటపడింది. విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసి కనీసం పట్టుమని నెలరోజులు కాకముందే బ్యాగులు చిరిగిపోయి మూలన పడేసి, సొంత బ్యాగులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. మరికొందరి బ్యాగులకు కుట్లు ఊడిపోవడం, జిప్‌లు పోవడంతో గుండుపిన్నులు వేసుకుని పాఠశాలకు వెళుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏదో చేసేస్తున్నామంటూ కూటమి ప్రభుత్వం మాయమాటలు చెబుతూ ఇంత అధ్వాన్నంగా నాసిరకం బ్యాగులను సరఫరా చేయడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ఇదే పరిస్థితి నెలకొంది. నెలరోజులకే సుమారు 40 శాతం మంది విద్యార్థులు తమ సొంత బ్యాగులను పాఠశాలకు తీసుకువెళ్లుతున్నారు.





బ్యాగులు చిరిగిపోయి, జిప్పులు, కుట్లు ఊడిపోయిన బ్యాగులతో స్కూల్‌కు వెళుతున్న విద్యార్థులు

వెన్నుపోటు రాజకీయాలు ఎక్కువయ్యాయి!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవేదన

వరదయ్యపాళెం: 'దళిత నియోజకవర్గమైన సత్యవేడులో ఇటీవల వెన్నుపోటు రాజకీయాలు ఎక్కువ అవుతున్నాయి. సంపన్న వర్గాలు పెత్తనం చెలాయించేందుకు ఆత్రుత పడుతున్నారు. వారి కుతంత్రాలకు, కుట్రలకు నేను వెరవను. అన్నీ భగవంతుడు చూసుకుంటాడు.' అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవేదన చెందారు. వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన అధికారుల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 15 ఏళ్లుగా నియోజకవర్గంలో ప్రజాసేవకే పరిమితమయ్యానే తప్ప, ఇతర వ్యాపకాలు, వ్యాపారాలకు ఏనాడు కక్కుర్తి పడలేదన్నారు. అయితే తాను నియోజకవర్గంలో రెండో సారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ కొన్ని అనివార్య కారణాలతో తనను పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిందని, ఈ తరుణంలో నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకులని ఒకరు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అని మరొకరు, తాజాగా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అని ఇంకొకరు ఇలా సంపన్న వర్గాల వారు నియోజకవర్గంలో పెత్తనం చెలాయించేందుకు తహతహలాడుతున్నారని విమర్శించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్‌రెడ్డి పదవి చేపట్టిన పది రోజులకే ఉన్న విభేదాలను ఇంకాస్త రెట్టింపు చేసి, ఇబ్బంది పెడుతున్నారే తప్ప సమన్వయం చేసి ఏకతాటిపై పార్టీని నడిపేందుకు ఏమాత్రం చొరవ చూపడం లేదన్నారు. తనకు, ఆయనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని, తామిద్దరం మంచి స్నేహితులే అయినప్పటికీ అయన వెంట ఉన్నవారు చెడు మార్గంలో నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అనుభవం లేని శంకర్‌రెడ్డి ఆలోచనతో ముందుకు పోవాలని సూచించారు. 15ఏళ్లుగా నియోజకవర్గంలో ఒక్కో గ్రామాన్ని నాలుగు నుంచి ఐదు సార్లు తిరిగిన అనుభవం తనకుందని, అలాంటి తన ప్రమేయం లేకుండా నియోజకవర్గంలో పర్యటిస్తూ వర్గవిభేదాలకు ఆద్యం పోస్తున్నారని ఆరోపించారు. తాను ఎక్కడా గ్రావెల్ గానీ, కాంట్రాక్ట్ పనులు గానీ, ఇసుక అక్రమ రవాణా గానీ, ఇతర అక్రమాలకు గానీ పాల్పడలేదని, అందుకు ఎక్కడైనా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, తాను నిస్వార్థ సేవకుడిగా నియోజకవర్గ ప్రజలకు, అభివృద్ధికి కృషి చేస్తానే తప్ప ఇతర కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటు రాజకీయాలు తనకు చేతకావని ఎమ్మెల్యే ఆదిమూలం తేల్చి చెప్పారు.

స్వచ్ఛతలో మరింత ముందుకు



అవార్డులతో నగరపాలక సంస్థ అధికారులు, కార్మికులు

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతి పరపతిని మరింత ఇనుమడింపజేసేందుకు అధికారులు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం స్వచ్ఛత విజయోత్సవ సభ నిర్వహించారు. గత వారంలో స్వచ్ఛభారత్ మిషన్ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల్లో తిరుపతి సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డును కైవసం చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తిరుపతి అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నూతన భవనం పూర్తి చేసేందుకు మరింత సమయం పడుతుందని, భవన నిర్మాణానికి అవసరమయ్యే నిధులను ఇప్పట్లో కేటాయించలేమని ఆయన చెప్పారు. తిరుపతిని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని, అవార్డు రావడం వెనుక అధికారుల కృషి, సిబ్బంది పనితీరు బాగుందని కొనియాడారు. అనంతరం కమిషనర్ మౌర్యాను గజమాలతో సత్కరించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బందిని వేదికపై సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్వామి భక్తి.. నిబంధనలకు స్వస్తి!

- అనునిత్యం అధికార పార్టీ నేతల సేవలోనే తరింపు
- ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వారితో అంటకాగే గుణం
- పదవి కోసం ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం ఆ అధికారి నైజం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రజాప్రతినిధుల సేవలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు తరించడం సహజం. అయితే స్వామిభక్తి చాటుకునేలా నిత్యం వారి సేవలో మునిగిపోతూ.. బాధ్యతగా చేపట్టాల్సిన బదిలీల్లో నిబంధనలకు స్వస్తి పలకడంతో పంచాయతీల్లో పరిపాలన పడకేసింది. పెద్ద ఎత్తున ముడుపులు పుచ్చుకుని పంచాయతీ గ్రేడ్లకు సరిపడా అధికారులను నియమించకుండా అంతకంటే తక్కువ గ్రేడ్ ఉన్న వారిని ఆ స్థానాలకు పంపడం విమర్శలకు తావిస్తోంది. దీనంతటికీ కారణం జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే ఓ ఉన్నతస్థాయి అధికారి తన అధికారం, హోదా కోసం పాకులాడుతూ అధికార పార్టీ నేతల సేవలో నిత్యం తరించడమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా గత నెలలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ప్రభుత్వం విడుదల చేసిన జీఓలోని నిబంధనలను అడుగడుగునా ఉల్లంఘించారన్న విమర్శలు వస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శుల బదిలీలను స్వయంగా నిర్వహించిన జిల్లాస్థాయి అధికారి అధికార పార్టీ ముఖ్యనేతలతో అంట కాగుతూ వారి సిఫార్సుల మేరకు ఏకపక్ష బదిలీలు నిర్వహించారన్న ఆరోపణలు వస్తున్నాయి. పంచాయతీ గ్రేడ్లను పరిగణనలోకి తీసుకుని బదిలీలు నిర్వహించాలని, ఉద్యోగ విరమణ వయసు దగ్గర పడిన ఉద్యోగులను బదిలీ చేయకూడదన్న నిబంధనలున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా సిఫార్సులు,కాసులకు ప్రాధాన్యతను ఇచ్చి, బదిలీల ప్రక్రియను పూర్తి చేశారన్న ఆవేదనను బదిలీల్లో అన్యాయం జరిగిన ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శుల బదిలీలే సాక్ష్యం

తిరుపతి రూరల్ మండలంలో గత నెలలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలే ఆ అధికారి అడ్డగోలు తనానికి నిదర్శమని పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. తిరుపతి రూరల్ మండలంలోని 34 మంది పంచాయతీ కార్యదర్శులకు జరిగిన బదిలీల్లో 12 మందికి పంచాయతీ గ్రేడ్లతో సంబంధం లేకుండా పోస్టింగ్‌లు ఇచ్చినట్టు సమాచారం. అందులో గ్రేడ్ -1 పంచాయతీలైన అవిలాల, బ్రాహ్మణపట్టు, సి.మల్లవరం, చిగురువాడ, గాంధీపురం, మంగళం, పద్మావతీపురం, పెరుమాళ్లపల్లి, పేరూరు, పుదిపట్ల, శ్రీనివాసపురం, తిరుమలనగర్ పంచాయతీలకు గ్రేడ్-2, గ్రేడ్-4, గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ గ్రేడ్ల కంటే తక్కువ స్థాయి కార్యదర్శులను నియమించడంతో వారికి పరిపాలన చేతకాక ఇబ్బందులు పడుతున్నట్టు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడం గమనార్హం. కాగా పంచాయతీ కార్యదర్శులే కాదు, సచివాలయ ఉద్యోగుల బదిలీల విషయంలో తీరని అన్యాయం జరిగిందని ఉద్యోగులు మదనపడుతున్నారు. దీనంతటికీ కారణం బదిలీల ప్రక్రియను అన్నీ తానై చూసుకున్న ఆ అధికారి అనాలోచిత నిర్ణయాలేనని ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ..

తన పదవికి ముప్పు వస్తుందనుకుంటే ఎంతకైనా తెగించే అధికారి తన పదవిని కాపాడుకోవడం కోసం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీతో అంటకాగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గల్లా అరుణ కుమారి, తరువాత టీడీపీ అధికారంలోకి రాగానే గాలి ముద్దుక్రిష్ణమనాయుడు, గల్లా అరుణ కుమారి, ఆపై వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో సఖ్యతగా మెలిగిన ఆ అధికారి తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ ఎమ్మెల్యేలతో కలసిమెలసి పనిచేస్తుండడం, అది కూడా తిరుపతికి చుట్టు పక్కలే విధులు నిర్వహించడం ఆ అధికారి లాలూచీతనానికి నిదర్శనమంటున్నారు కలెక్టరేట్ ఉద్యోగులు. విధుల్లో భాగంగా నిత్యం చేసే పనులే కాకుండా బదిలీల విషయంలో ఆ అధికారి అడ్డగోలు నిర్ణయాలకు ఒకే సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులకు మేలు కలుగుతోంది తప్ప, అన్ని అర్హతలు కలిగియున్న మిగిలిన వారికి అన్యాయమే జరుగుతోందన్న వాదనలు కూడా ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నిందితుని ఆచూకీ తెలిపితే రూ. 5లక్షలు నజరానా

వరదయ్యపాళెం: తమిళనాడులో సంచలనం కలిగించిన బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుని ఆచూకీ తెలిపిన వారికి రూ.5లక్షలు నజరానా ఇవ్వనున్నట్లు గుమ్మిడిపూండి డీఎస్పీ జయశ్రీ తెలిపారు. నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యల్లో భాగంగా వరదయ్యపాళెం మండలంలో పర్యటించిన డీఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా వివరాలను తెలిపారు. తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంలో ఓ బాలికను అపహరించి, లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించామన్నారు. నలుగురు ఎస్పీల పర్యవేక్షణలో నాలుగు బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి ప్రభుత్వం తరపున రూ. 5లక్షలు నజరానా ఇస్తామని ఆమె వివరించారు. 9952060948 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు.



లైంగిక దాడికి పాల్పడిన నిందితుని చిత్రం

సీట్ల కేటాయింపులోనూ వైఫల్యమేనా?

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు జాబితా మంగళవారం విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదయం నుంచి ఎంతో ఉత్కంఠతో సెల్‌ఫోన్లకు అంకితమై ఎదురుచూశారు. కానీ అర్ధరాత్రి వరకు సీట్ల కేటాయింపుపై ఎటువంటి సమాచారం అందకపోవడంతో నిరాశతో ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. సీట్ల కేటాయింపులోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, షెడ్యూల్ ప్రకారం జూన్ 22న ప్రకటించాల్సి ఉండగా ఇంతవరకు తమకు ఎటువంటి మెసేజ్‌లు రాలేదని వాపోతున్నారు. ఇటు అధికారులను వివరణ కోరగా మరో గంటలో తల్లిదండ్రుల మొబైల్‌ఫోన్లకు మెసేజ్ వస్తుందంటూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు చెబుతుండడం గమనార్హం. బుధవారమైనా సీట్ల కేటాయింపు జరిగేనా? అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముదిరాజ్ జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

రేణిగుంట: మండలంలోని కుర్రకాలువ గ్రామంలోని మాజీ సర్పంచ్ రాణెమ్మ ఇంటి ఆవరణలో మంగళవారం అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కోలీ ముదిరాజ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు రెడ్డి బాబు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, కిలా బాలకృష్ణ, ఓబులేసు, శ్రీను, మణి కుమార్, రెడ్డి కల్యాణ్ పాల్గొన్నారు. సమావేశ అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా చైర్మన్‌గా కుర్రకాలువ వేణు, జిల్లా అధ్యక్షుడిగా నేడమ్ మునెయ్య, ఉపాధ్యక్షులుగా కోనేటి అయ్యప్ప, కుంట్ర పాకు మునస్వామి, పులుసు పాండు రంగయ్య, ప్రధాన కార్యదర్శులు కొప్పుల సురేష్, కుంట్రపాకు మునిరాజు, కార్యదర్శులు లోకేష్, ప్రేమ్ కుమార్, శివ, జ్ఞానశేఖర్, సోషల్ మీడియా కార్యదర్శి నరేంద్ర, కోశాధికారిగా సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, చంద్రశేఖర్, చంద్రమౌళి, గురవయ్య, యువరాజ్, కమలాకర్, పవన్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కూలీల సంఖ్య పెంచండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల కూలీల సంఖ్య పెంచాలని పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం కాటూరులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 6 వేల మంది కూలీలు పనిచేయాల్సిన ఉండగా 3,200 మంది కూలీలు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇళ్ల వద్ద నున్న వర్మీ కంపోస్టు పిట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దేవరి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవం నిర్వహించండి

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్నాతకోత్సవం నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని జీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడిని మంగళవారం ఆయన కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో 62వ కాన్విికేషన్ నిర్వహించారని, అప్పటి నుంచి కాన్విికేషన్ నిర్వహించకుండా జాప్యం చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. డిగ్రీ, పీజీ పూర్తి అయిన పేద విద్యార్థులు ఇన్ అడ్వాన్స్ ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతూ ధ్రువపత్రాలను తీసుకోలేకపోతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు చొరవ చూపి స్నాతకోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రశేఖర్ నాయక్, సురేంద్ర, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రగతిని సాధించేలా పనిచేయాలి
- డీఈఓ కేవీఎన్ కుమార్



మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్

నాయుడుపేటటౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేయాలని తిరుపతి డీఈఓ కేవీఎన్ కుమార్ సూచించారు. నాయుడుపేట విశ్వం జూనియర్ కళాశాలలో మంగళవారం గూడూరు డివిజన్‌లోని ఎంఈఓలు, క్లస్టర్ హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ప్రభుత్వ సూచించిన మేరకు నూతన విద్యావిధానాలను విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి ఫలితాలు సాధించేందుకు ముందు నుంచే ప్రణాళికలను రూపొందించాలన్నా రు. పాఠశాలలో విధి విధానాలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో గూడూరు డీవైఈఓ సనత్ కుమార్, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీ శంకర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సచివాలయ ఉద్యోగులకు మోక్షం

- ఉదయం బదిలీల జాబితా వెల్లడి
- వెంటనే రిలీవ్ కావాలని ఆదేశాలు
- మధ్యాహ్నం కొత్త స్థానంలో బాధ్యతల స్వీకరణ

తిరుపతి అర్బన్: సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 17 రోజుల తర్వాత ఎట్టకేలకు బదిలీల మోక్షం లభించింది. మంగళవారం ఉదయం బదిలీల జాబితాను వెల్లడించారు. వెంటనే రిలీవ్ కావాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉద్యోగులు ఉదయం తమ స్థానం నుంచి రిలీవ్ అయ్యారు. మధ్యాహ్నం కొత్త స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త ఉద్యోగులు సందడి చోటుచేసుకుంది. జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నప్పటికి ఇటీవల రేషనలైజేషన్ పేరుతో 353కి కుదించారు. దీంతో 5,625 మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ సచివాలయాల కుదింపు నేపథ్యంలో 3,650 మందికి మాత్రమే బదిలీల అవకాశం కల్పించారు. మిగిలిన 1,975 మంది మిగులు ఉద్యోగులను వివిధచోట్ల సర్దుబాటు చేసినట్లు తెలుస్తుంది. బదిలీల జాబితా విడుదల కోసం సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాటాలకు సమాయత్తం అవుతుండడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఉన్నట్లుండి మంగళవారం బదిలీల జాబితాను ప్రకటించడంతోపాటు వెంటనే రిలీవ్ కావాలని, కొత్త స్థానంలో చేరాలని ఆదేశాలు ఇచ్చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగుల బదిలీల అంశానికి ముగింపు పలికినట్లు తెలుస్తుంది.

నేను సైతం ద్వారా మహిళకు ఇంటి నిర్మాణం

చిల్లకూరు: ఓ చానల్‌లో నిర్వహించిన నేను సైతం కార్యక్రమం ద్వారా ఓ మహిళకు ఇంటిని నిర్మించి ఇచ్చారు. గూడూరు రెండో పట్టణంలోని తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఉష అనే పేద మహిళ రైలు ప్రమాదంలో కాలు పోగొట్టుకోవడంతో పాటుగా భర్తను కోల్పోయింది. దీంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో జీవనం కష్టంగా మారడంతో ఓ చానల్‌లో ప్రముఖ సినీ నటి మంచి లక్ష్మి చేపట్టిన నేను సైతం అనే కార్యక్రమంలో పాల్గొని, తన బాధను తెలియజేసింది. దీంతో ఆమెకు అండగా ఉండేలా ఇంటిని నిర్మించి ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. ఈ క్రమంలో మంగళవారం ఉష ఇంటికి సినీ నటి మంచు లక్ష్మి చేరుకుని, ఉష కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఉష మాట్లాడుతూ తన బాధలను గుర్తించి మంచు లక్ష్మి, మనోజ్ తనకు అండగా నిలిచి ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇచ్చారన్నారు. అలాగే తన కుమారుని చదువుకు సహాయం చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందుగా మంచు లక్ష్మి పట్టణంలోని సనత్‌నగర్‌లో ఉన్న బంధువులైన రవీంద్రరెడ్డి నివాసంలో కొంత సేపు గడిపి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



ఉష కుటుంబ సభ్యులతో మంచు లక్ష్మి

ఘాట్ సర్వీసులు వందశాతం కండీషన్‌లో ఉంచుకోండి

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్‌రోడ్డులో నడుపుతున్న ఆర్టీసీ సర్వీసులు వందశాతం కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ టి.బాలాజీ తెలిపారు. తిరుపతిలోని ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని 11 డిపోలకు చెందిన మెకానికల్ ఇంజినీర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లకు బస్సుల కండీషన్‌ను గుర్తించడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సెప్టెంబర్ చివరి వారంలో తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రతి డిపోలో 100 శాతం కండీషన్‌లో ఉండే సర్వీసులపై దృష్టి పెట్టాలని చెప్పారు. తిరుమల ఘాట్‌లో 310 డీజిల్ బస్సులు, 50 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయని చెప్పారు. ఈ 360 సర్వీసులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం పలు ప్రైవేటు కంపెనీల నుంచి హాజరైన ఇంజినీర్లు మాట్లాడుతూ బస్సుల కండిషన్‌పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా బస్సు కండీషన్ ఏలా ఉందో సులభంగా గుర్తించడానికి పలు చిట్కాలను ఆర్టీసీ ఇంజనీర్లకు తెలియజేశారు. అంతేకాకుండా ప్రమాదాల నివారణలో డ్రైవర్లతోపాటు మెకానిక్‌ల పనితనం చాల ఉందని చెప్పారు. వందశాతం బస్సును కండిషన్‌లో ఉంచడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ఘాట్‌లో నడుస్తున్న సర్వీసుల విషయంలో చిన్న చిన్న సమస్యలు ఉన్న కొత్త విడిభాగాలను ఏర్పాటు చేయడమే ఉత్తమంగా పేర్కొన్నారు. అవసరం అయిన మేరకు ఆర్టీసీ కొత్త విడిభాగాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్ లేలాండ్ కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ సూర్యనారాయణ బోస్, సర్వీస్ ఇంజనీర్ వడివేలు, రామే పవర్ స్టీరింగ్ సిస్టమ్ ప్రతినిధులు అర్జున్, నాగరాజు, సర్వీస్ ఇంజినీర్ లూకాస్, టీవీఎస్ నుంచి సర్వీస్ ఇంజినీర్లు శ్రీనివాస్, జెడ్ఎఫ్ ఈఎంఆర్ నుంచి కన్నదాసన్, అమర్‌రాజా బ్యాటరీస్ నుంచి మధు, డబ్ల్యూఏబీసీఓ సంస్థ నుంచి సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు కండీషన్ ఎలా గుర్తించాలన్న విషయం వివరిస్తున్న ఇంజనీర్